www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 29 జనవరి 2024

5

కోనసీమ

'ఒపిఎస్' సభకు యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-ఆలమూరు

రాజమహేంద్రవరంలో జరిగిన పాత పెన్షన్ సాధన సభకు ఆలమూరు యుటిఎఫ్ మండల శాఖ నాయకులు ఆదివారం తరలి వెళ్లారు. వారు మాట్లాడుతూ పాత పెన్షన్ సాధన లక్ష్యంగా యుటిఎఫ్ పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా మాజీ ఎంఎల్సి శర్మను కలసి తమ గోడు వెళ్లబుచ్చారు. ఈ కార్యక్రమంలో వైవివి.రమణ, అద్దరి శ్రీనివాసరావు, జి.భాస్కర్‌రెడ్డి, పివివిజిఎస్ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంఎల్సి శర్మతో యుటిఎఫ్ మండల శాఖ నేతలు

ఒపిఎస్ ఇచ్చేవారికే ఓటు

- యుటిఎఫ్ సభలో వక్తల స్పష్టీకరణ
- ఫిబ్రవరి నుంచి ఉద్యమ కార్యాచరణ
- ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రానున్న ఎన్నికల్లో పాత పెన్షన్ విధానం(ఒపిఎస్)ను అమలు చేసేవారికే ఓటు వేస్తామని యుటిఎఫ్ సభలో పలువురు వక్తలు స్పష్టం చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'ఓట్ ఫర్ ఒపిఎస్' సభను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. వేలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈ సభకు తరలొచ్చారు.

ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎంఎల్సి కెఎస్.లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెన్షన్ బిక్ష కాదు హక్కు అని మరోసారి గుర్తు చేశారు. అనేక పోరాటాల ఫలితంగా ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం అమల్లోకి వచ్చిందన్నారు. ఉద్యోగులకు నష్టం వాటిల్లేలా సిపిఎస్‌ను ప్రభుత్వాలు తీసుకొచ్చాయన్నారు. రాష్ట్రంలో మూడు లక్షల మంది ఉద్యోగులకు సిపిఎస్ అమలువుతుందన్నారు. పాత పెన్షన్ విధానంపై రాజకీయ పార్టీలు తమ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం అమలుల్లోకి తెచ్చిన జిపిఎస్ కూడా సిపిఎస్ వంటిదేనని ఆయన స్పష్టం చేశారు.

మరో పిడిఎఫ్ ఎంఎల్సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్ తెచ్చిన వారిని ఓడించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ 50ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని ఆయన గుర్తు చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం పోలీసుల సహకారంతో అణచితకు గురిచేస్తుందన్నారు. ఇది సరైన పద్ధతికాదన్నారు. ఉపాధ్యాయులను నేరస్తులుగా చూడటం తగదన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ పాత పెన్షన్ కోసం జరిగే పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. రాష్ట్రంలో రాజకీయపార్టీలు ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం గెలిచిన తరువాత కార్పొరేట్లకు సేవచేయడం ఆసవాయితీగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుటిఎఫ్ తలపెట్టిన పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జిపిఎస్‌లో డొల్లతనాన్ని వివరించారు. గ్యారెంటీ లేని పెన్షన్‌కు గ్యారెంటీ పేరు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో అమలవుతున్న ఇలాంటి పెన్షన్ పథకం వల్ల అక్కడ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతున్నామని, దీనికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఒపిఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చడంతో పాటూ మొదటి సంతకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎంఎల్సి ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఒపిఎస్ దేశ వ్యాప్త సమస్యగా మారుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో సిపిఎస్ రద్దు నినాదం దిశా నిర్దేశం చేస్తుందన్నారు. ఇపిఎఫ్-95 ఉద్యోగులకు ఇప్పటికీ కొదిపాటి పెన్షనే వస్తుందన్నారు. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులతో నానా అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఓట్ ఫర్ ఒపిఎస్‌కు ఏ రాజకీయ పార్టీ నుంచీ మద్దతు లభించకపోతే శాసన సభలకు సొంతంగా ప్రతినిధులను పంపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో ఉన్న సిపిఎస్ బాధితుల వివరాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు, సిపిఐ నాయకులు జ్యోతిరావు, ఆప్ రాష్ట్ర నాయకులు వై.శ్రీనివాసరావు, బిఎస్పి నాయకులు పట్నాల విజయ్‌కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు మనోహర్, అరుణకుమారి, గోపి మూర్తి, జ్యోతిబసు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎస్‌కె.షరీఫ్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కొమ్మోజు శ్రీనివాసరావు, కె.సురేష్‌కుమార్, జివి.రమణ, హనుమంతరావు, ఉమాశంకర్, కుమార్ రాజా, లక్ష్మీరాజు, రెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి నుంచి ఉద్యమ కార్యాచరణ

ఒపిఎస్ సాధనకు ఫిబ్రవరి నుంచి ఉద్యమ కార్యాచరణను యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ వివరించారు. ఫిబ్రవరి 12 నుంచి మండల స్థాయిలో ఫిబ్రవరి 18 నుంచి 21 వరకూ నియోజకవర్గ స్థాయిలో ఫిబ్రవరి 25 నుంచి 28 వరకూ జిల్లా స్థాయిలో అన్ని రాజకీయపార్టీల నాయకులను కలిసి ఈ మేరకు వినతిపత్రాలు ఇవ్వాలని తెలిపారు. మార్చి నుంచి ఓట్ ఫర్ ఒపిఎస్ పేరుతో ప్రతి ఇంటికీ, వాహనాలకు స్టిక్కర్లు అంటించాలని అన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సభల్లో ఓట్ ఫర్ ఒపిఎస్ ప్లకార్డులను ప్రదర్శించాలన్నారు. మార్చి 15 తర్వాత చర్చావేదికలు, 26 నుంచి 30 వరకూ బైకు ర్యాలీలు నిర్వహించాలని కోరారు.

హోరెత్తిన రాజమహేంద్రవరం

యుటిఎఫ్ సభ నేపథ్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల నినాదాలతో రాజమహేంద్రవరం నగరం హోరెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు వేలాది సంఖ్యలో ప్రదర్శనగా సభా స్థలికి చేరుకున్నారు. వేలాదిమంది మహిళా ఉపాధ్యాయులు ఈ సభకు తరలొచ్చారు. సిపిఎస్ రద్దు చేయాలని, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి, సిపిఎస్ ఇచ్చేవారికే మా ఓటు అంటూ నినదించారు.

సభకు హాజరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు

సభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్సి కెఎస్.లక్ష్మణరావు

సభలో ఉద్యమ గీతాలను ఆలపిస్తున యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు



వచ్చే ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలి: ఎంపీ బోస్

ప్రజాశక్తి-రామచంద్రపురం

వచ్చే ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేసి వైసిపిని గెలిపించుకోవాలని సీనియర్ నాయకులు రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆదివారం కె.గంగవరం మండలంలోని కోటిపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కుమ్మరసావరం, శెట్టి బలిజపేట, దళిత పేటలో పర్యటించి పలువురు వైసిపి నాయకులమద్దతు కూడగట్టారు. అదేవిధంగా త్వరలో జరిగే నాడు సిద్ధం నేడు సిద్ధం కార్యక్రమానికి కార్యకర్తలంతా తరలిరావాలని కోరారు. ఆయన కలిసిన వారిలో కోటిపల్లి అబ్బు, మానే చిన్నా పెమ్మాడి మల్లేశ్వరరావు, పంపన సుబ్బారావు, కుందూరు సర్పంచ్ పంపన సత్యానందం, కూళ్ల సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, కె.గంగవరం మండలం వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



కోటిపల్లిలో నేతలతో మాట్లాడుతున్న ఎంపీ బోస్



బొబ్బర్లంకలోసచివాలయం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని స్థానిక ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు ఆదివారం ఆయన మండలంలోని గ్రామాల్లో రూ.5 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. బొబ్బర్లంక గ్రామంలో రూ.79.3 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బికె, వెల్నెస్ సెంటర్ల భవనాలను, వెలిచేరు గ్రామంలో రూ.56.8 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను, వద్ధిపర్రు గ్రామంలో రూ.79.3 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను, ర్యాలి గ్రామంలో రూ.61.8 లక్షల తో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను, నార్కేడ్ మిల్లి గ్రామంలో రూ.1 కోటి 95 లక్షలతో నిర్మించిన రోడ్లు, డ్రైనేజీలను, అంకంపాలెం గ్రామంలో రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎంఎల్ఎ జగ్గిరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రతీ గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సిఎం సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పరిపాలన సాగించారని, అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ ను అగ్రస్థానంలో నిలిపారని పేర్కొన్నారు.

నేడు యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోన సీమ జిల్లా స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు జిల్లా స్థాయి ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక స్పందన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ఈ నెల 29న సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా జరుగునని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు కోరాలని ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

బాబు షూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ

బిసిలకు అండగా ఉంటా... ఎంఎల్ఎ వేగుళ్ల

ప్రజాశక్తి-ఆలమూరు

నియోజకవర్గంలోని బిసిలం దరికీ తాను అండగా ఉంటానని, బిసిలంతా ఐక్యంగా ఉండి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని చినద్వారపూడి గ్రామంలో 'బాబు షూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో ఆయన పాల్గొని టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఆదరణ పథకం ద్వారా బిసిలకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూరిందన్నారు. వైసిపి ప్రభుత్వం రూ.75 వేల కోట్ల బిసి సబ్ ప్లాన్ నిధులను దారి మళ్ళించి బిసిలకు తీరని అన్యాయం చేసిందన్నారు. బిసిలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. బిసిల అభ్యున్నతికి గత టిడిపి ప్రభుత్వం పాటుపడిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కమిటీ బి.సి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

- ప్రారంభమై ఏడాదైనా పూర్తికాని ద్రాక్షారామ- రామచంద్రపురం మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి-రామచంద్రపురం

నిత్యం రద్దీగా ఉండే మెయిన్ రోడ్లలో ద్రాక్షారామ రామచంద్రపురం మెయిన్ రోడ్డు ముఖ్యమైనది. ఈ రోడ్డు ఐదేళ్లుగా పూర్తిగా పాడై ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మంత్రి వేణు, ఒక ఎంఎల్సి తోట త్రిమూర్తులు, ఎంపీ బోస్ ముగ్గురు నాయకులు ఉన్న ఈ నియోజకవర్గంలో మెయిన్ రోడ్డు పరిస్థితి ఇలా ఉండడంతో పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు. రామచంద్రపురం నుంచి ద్రాక్షారామ వయ యానాం వరకు ఉన్న ఈ రహదారి 28 కిలోమీటర్లు పూర్తిగా గోతులమయంగా ఉంది. ఎట్టకేలకు ఈ మెయిన్ రోడ్డు గత ఏడాది మార్చిలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అట్టహాసంగా పనులు ప్రారంభించారు. ఏడాది గడిచినా ఈ రోడ్డు పూర్తి కాకపోవడంతో ప్రజలు ప్రయాణికులు నిత్యం ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే యాత్రికులు ఈ రోడ్డుపై ప్రయాణం సాగిస్తూ ఇబ్బందులు పడ్డారు. రోడ్డు ప్రారంభమైన కొంత భాగం తారు రోడ్డు వేసి మిగిలిన రోడ్ అంతా తవ్వి వదిలేశారు. దీంతో ద్రాక్షారామ, వేగాయంపేట, జగన్నాయకులుపాలెం, ఎర్ర పోతవరం, బాలాంత్రం తదితర అనేక గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఇక రాత్రి సమయంలో పలు ప్రమాదాలు జరిగి పలువురు తీవ్ర గాయాలు పాలయ్యారు. మరికొందరు మతి చెందారు. రోడ్డు ప్రమాదాలు వల్ల చోటు చేసుకుంటోంది. తవ్వి వదిలేసిన ఈ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ద్రాక్షారామ పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డును తవ్వేయడంతో దుమ్మధూళితో నిండిపోయిన రోడ్డు

త్వరలో పనుల ప్రారంభం : ఆర్అండ్‌బి డిఇ

తవ్వి వదిలేసిన ద్రాక్షారామ రామచంద్రపురం మెయిన్ రోడ్డు పై రహదారి భవనాల శాఖ డి ఇ వెంకటేశ్వరరావు వివరణ కోరగా ఈ రోడ్డు పనులు నిలిచిపోవడానికి రోడ్డుపై రెండో పొర మెటీరియల్ రావాల్సి ఉంది. మెటీరియల్ స్టాక్ పెట్టి త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఒకటి రెండు నెలల్లో రోడ్డు పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.

సేవా పురస్కార గ్రహీతలకు సత్కారం

ప్రజాశక్తి-యంత్రాంగం

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు అమాపురంలో ఈ నెల 26న జరిగిన గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. వీరిని ఆదివారం సత్కరించారు.

ఆత్రేయపురం గణతంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ హిమాన్షు శుక్లా, మంత్రి విశ్వరూప్ చేతులమీదుగా మండల అభివృద్ధి అధికారిని నాతి బుజ్జి సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి బొబ్బర్లంకలో ఆదివారం మండల అభివృద్ధి అధికారి నాతి బుజ్జిని సత్కరించారు. అనంతరం ఎంఎల్ఎ జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఎంపిడిఒ మండలం గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించడంతోపాటు సంక్షేమం, అభివృద్ధి చేయడంలో జిల్లాలోని మండలాన్ని ప్రథమ స్థానంలో నిలిపారు.

ఆత్రేయపురం ఎంపిడిఒను సత్కరిస్తున్న ఎంఎల్ఎ

సేవలతోనే గుర్తింపు

మండపేట చేసిన సేవలు గుర్తింపునిస్తాయని రిటైర్డ్ ఉపాధ్యాయులు గెడ శ్రీనివాస్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఏడిద గ్రామపంచాయతీ కార్యదర్శి యు. వీర్రాజును వ్యాయామ ఉపాధ్యాయులు సిద్ధాంతపు వీర్రాజు, ఆడుదాం ఆంధ్ర మండపేట నియోజకవర్గం కబడీ ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు.

ఏడిద కార్యదర్శి వీర్రాజుకు సత్కారం

పలువురికి ప్రతిష్టాత్మక అవార్డులు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురంలోని సేవా సమితి కార్యాలయంలో పలువురు ప్రముఖులకు ఆదివారం అవార్డులు ప్రదానోత్సవం జరిగింది. అంతర్జాతీయ మానవతా స్వచ్ఛంద సేవాసమితి అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది ఎమ్.రామకృష్ణారావు, హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయుడు శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ అవార్డ్ గ్రహీత , ఆంధ్ర సేవారత్న కరాటం ప్రవీణ్‌కు కళారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు డైలాగ్ కింగ్ అనే బిరుదుతో పాటు ప్రతిష్టాత్మక అవార్డు అందజేశారు. అలాగే ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ ప్రిన్సిపల్‌గా వెంకటేశ్వరా కళాశాల ప్రిన్సిపల్ కరాటం మనోహర్, ఉత్తమ ఉపాధ్యాయుడిగా యాలంగి వరప్రసాద్, ఉత్తమ పాస్టర్ గా చోడే జాన్ పాల్, ఉత్తమ కవిగా సీలి సంసాన్, డాక్టర్ ముషిణి సంధ్యా రేఖకు ప్రకృతి వైద్య నారీరత్న అవార్డులు అందుకున్నారు. ఉత్తమ సర్పంచ్‌లు పెనుమాల సునీత, రేలంగి దుర్గారావు, గంగుమళ్ల ఏసుబాబు, తిక్కిరెడ్డి శ్రీను విశిష్ట సేవా పురస్కారాలు పొందారు. అవార్డు గ్రహీతలను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో కరాటం సూరిబాబు, ఎ.సోమేశ్వరరావు, ఎం.రాము, ఎంవి ఎల్ నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న పలువురు ప్రముఖులు

బాలబాలాజీ స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారిని ఆదివారం ప్రముఖులు దర్శనం చేసుకున్నారు. ఛండిగఢ్ జ్యూడిషియల్ మెంబర్ ఎన్‌సిఎల్‌టి న్యూఢిల్లీ వాసులుపిఎస్ఎన్.ప్రసాద్ దంపతులు, చీఫ్ అడ్మినిస్ట్రేట్ పోలీస్ ఆఫీసర్ సి.గోవిందరాజన్ దంపతులు బాల బాలాజీ స్వామి దర్శనం చేసుకున్నారు. వీరికి వేద పండితులు ఆశ్వీరాదం అందించారని, ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ వారికి స్వామి వారి చిత్ర పటం, ప్రసాదం అందజేశారని సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు.



ప్రముఖులను సత్కరిసున్న చైర్మన్

టిడిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేశానని విజయనగరం జోనర్ ఆర్ టిసి జోనల్ మాజీ ఛైర్మన్, మాజీ ఎంపిపి నెక్కంటిబాలకృష్ణ అన్నారు. వెదురుమూడి లో ఆదివారం తన అనుచరులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు పర్యాయాలుగా ఎంఎల్ఎగా కొనసాగుతున్న వేగుళ్ల జోగేశ్వరరావు సీనియర్ నాయకులను పట్టించుకోవడంలేదని విమర్శించారు. చంద్రబాబు ఈ నెల 20 న మండ పేటలో నిర్వహించిన రా కదిలి రా సభలో ఎంఎల్ఎ అభ్యర్థిగా వేగుళ్ల జోగేశ్వరరావుని ప్రకటించడం నిరాశకు గురి చేసిందన్నారు. అయినప్పటికీ పార్టీ అధిష్టానం నిర్ణయమే శిరోధారంగా పార్టీ విజయానికి కృషి చేస్తానని బాలకృష్ణ తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారం అందజేత

ప్రజాశక్తి-ఆలమూరు

విధి నిర్వహణ చేసిన సేవలకు పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు ఈ నెల 26న జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ హిమాన్షు శుక్లా, మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ అందజేశారు. మండలంలోని గుమ్మిలేరు గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఆదివారం ఆయనకి పంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు. అలాగే గ్రామానికి మరింత సేవ చేయాలని వారు ఆకాంక్షించారు.

పురస్కారం అందుకుంటున్న గుమ్మిలేరు సర్పంచ్ రాంబాబు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు మండలంలోని గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తిక్కిరెడ్డి కపాకీర్తన ఎంపికైంది. ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు కపాకీర్తన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున గుంటూరు జిల్లా నరసరావుపేటలో ఈనెల 29 నుంచి 31 వరకు జరిగే క్రికెట్ పోటీలలో పాల్గొననుంది. కపాకీర్తన ను ఆదివారం హెచ్ఎం ఎల్.రాణి, పియంసి ఛైర్మన్ దోనిపాటి రమా వెంకటరమణ, పిడి గొలకోటి ఫణీంద్ర కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం

ప్రజాశక్తి-మండపేట

పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కామన ప్రభాకరరావు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్.రాజశేఖరరెడ్డి తుది శ్వాస వరకూ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సైతం రాజన్నకు పెద్ద పీట వేసిందన్నారు. రెండుసార్లు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్‌గా, రెండు సార్లు రాష్ట్ర ముఖ్య మంత్రి గానూ అవకాశం కల్పించిందన్నారు. రాజన్న నిజమైన వారసురాలు షర్మిల మాత్రమేనన్నారు. టిక్కెట్లు కోసం ఆశావాహులు పోటెత్తుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి శ్రేణులంతా కష్టించి పని చేయాలన్నారు.

మాట్లాడుతున్న కామన ప్రభాకరరావు

నేరాలు ఘోరాలు

దేవాలయంలో దొంగల బీభత్సం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

అన్నపూర్ణ సమేత రామ లింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. నలుగురు వ్యక్తులు ఆలయంలో ప్రవేశించి ప్రధానాలయం తాళాలు పగులగొట్టి అన్నపూర్ణ అమ్మవారి ఆలయంలో చొరబడి, అమ్మవారికి రోల్డ్ గోల్డ్ నగలు ధరించడంతో అవి నకిలీవని వదిలిపెట్టి వెళ్లిపోయారు. అనంతరం హుండీలను బయటకు తెచ్చి వాటిని పగులగొట్టారు. అయితే ఇటీవలే హుండీలు ఖాళీ చేయడంతో చెప్పుకోదగ్గ ఆధాయం లేకపోవడంతో ఆలయానికి పెద్దగా నష్టం వాటిల్లలేదు. అలాగే ఆలయంలో ఉన్న అర్చకుని మోటారు సైకిల్‌ను దొంగిలించేందుకు ప్రయత్నించి మరలా దానిని తీసుకువచ్చి ఆలయం బయట ఉంచి దొంగలు పరారాయ్యారు. కాగా ఈ చోరీ యత్నం పై ఆలయ స్వామీజీ పరమానంద గిరి స్వామి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఆలయంలో చోరీకి జరిగిన ప్రయత్నాలను సిసి కెమెరాలలో నమోదు ఐన దృశ్యాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లిలో మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాప్‌పై ఎస్ఐ కెఎం.జోషి ఆదివారం రాత్రి దాడి జరిపారు.13 క్వార్టర్ మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకుని షాపు నిర్వాహకుడు ఎం. సాంబశివరావును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న ఆరుగురు అరెస్ట్

ప్రజాశక్తి- కడియం

మండలంలోని వేమగిరితోటలో కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.3,650 నగదు, కోడిపుంజు, కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నామని సిఐ బి.తులసీధర్ తెలిపారు. కోడిపందేలు, జూదాలు ఇతర అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యాయామ ఉపాధ్యాయుడు ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జల్లి మహాలక్ష్మయ్య శనివారం రాత్రి ఆకస్మికంగా మరణించారు ఆయన స్వగ్రామమైన పి.గన్నవరం మండలం ఊడిమూడిలోని ఆయన భౌతికకాయాన్ని పిఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జార్జి సందర్శించి నివాళులర్పించారు. జార్జి మాట్లాడుతూ మహాలక్ష్మయ్య వత్తి నిర్వాహణలో ఎనలేని సేవలు అందించడమే కాకుండా ఎంతో మంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దారని అన్నారు. లక్ష్మయ్య మృతి తీరని లోటన్నారు. ఆయన పనిచేసిన పాఠశాల పేరును జాతీయ స్థాయికి తీసుకుని వెళ్లారన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం మురళీనగర్‌లో రూ.6లక్షల మండల పరిషత్ నిధులతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు వైసిపి సీనియర్ నాయకులు సుంకర వీరబాబు ఆధ్వర్యంలో నాయకులు దాసరి చినబాబు, వరసాల ప్రసాద్, సుంకర రమణ, పులపర్తి బుజ్జి. శ్రీను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుంకర వీరబాబు మాట్లాడుతూ గ్రామంలోనే కాకుండా మండలంలోని ఏ పంచాయతీలోనైనా అపరిశుభ్ర వాతావరణం లేకుండా చక్కని వాతావరణాన్ని కల్పించాలని డ్రెయినేజీ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. తాగునీటి కొరత లేకుండా ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. తద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే వైసిపి లక్ష్యమన్నారు.

బాధితులకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ముక్కామలలో పలువురు బాధితులను ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు ఆదివారం పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన వైసిపి అధ్యక్షులు అరిగెల శ్రీను కుమారుడుని పరామర్శించారు. ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వైసిపి నాయకుడు అరిగెల సుబ్బారావును పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపిపి కె.సీతారాం(ప్రసాద్, వైస్ ఎంపిపి వేండ్ర శ్రీను, ఎంపిటిసి సభ్యులు గండేపల్లి రామకృష్ణ, సొసైటీ అధ్యక్షులు రేలంగి ఏసు, విద్య కమిటీ వైర్మన్ అరిగెల నాగరాజు, ఖండవల్లి ఎంపిటిసి సభ్యులు బి.వెంకటేశ్వరరావు, అడపా బ్రహ్మం, ముత్యాల పెద్దకాపు, యు.శ్రీను, చీపుర్లు సుందర్రావు, ఆర్.భీముడు, వి.చౌదరి, వైసిపి నాయకులు ఉన్నారు

వైసిపిని ఓడించేందుకు జనం సిద్ధం

ప్రజాశక్తి - కాకినాడ

అవినీతి, అరాచకం, దోపిడీ, విధ్వంసంతో కూడిన పాలనను సాగిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అన్నారు. ఓటర్ వెరిఫికేషన్, భవిష్యత్తు గ్యారెంటీ, మై టిడిపి, తదితర అంశాలపై స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ జగన్ అహంకారానికి, వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు అందరూ సిద్ధంగా ఉన్నారని, వైసిపి ప్రభుత్వ అరాచక విధ్వంసక పాలన వల్ల రాష్ట్రం ఎంతో నష్టపోయిందన్నారు. వైసిపి అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడవలసిన బాధ్యత నేడు ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. జగన్ అసమర్థత పాలన వల్ల రాష్ట్ర అప్పులు పాలు అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు, ఇంటి పన్నులు, విద్యుత్ చార్జీలు, బస్ చార్జీలను 5 రెట్లు పెంచి, చెత్త పన్నులు లాంటివి వేసి రాష్ట్ర ప్రజల రక్తాన్ని జగన్ జలగలా పీల్చిస్తున్నాడని విమర్శించారు. ఈ ఐదేళ్ల కాలంలో జగన్ ఆంధ్ర రాష్ట్రానికి ఒక పరిశ్రమను, ప్రాజెక్టును తీసుకు రాకపోగా, ఉన్న పరిశ్రమలను జె టాక్స్‌లతో బెదిరించి ఇతర రాష్ట్రాలకు తరిమేస్తున్నారని, తద్వారా రాష్ట్ర యువతను నిరుద్యోగులు మార్చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని జగన్ ఇప్పుడు చెబుతున్నాడని, కానీ ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వైసిపి పార్టీని ఓడించేందుకు తాము సిద్ధమని ఎప్పుడో చెప్పారని అన్నారు. జగన్‌కి కౌంట్ డౌన్ మొదలైందని, ఆంధ్ర రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న అరాచక విధ్వంసకర పాలనను ప్రతి కుటుంబానికి వివరించారు. టిడిపి-జనసేనను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, ఇంటిగ్రేటెడ్ శిక్షణ పరిశీలకులు యు.శివశంకర్, సత్యనారాయణ, సాంబశివరావు, కశింకోట చంద్రశేఖర్, తుమ్మల రమేష్, రహీమ్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా...

ప్రజాశక్తి - రౌతులపూడి

ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని శృంగవరం గ్రామంలో బొంగు నాని, మాజీ ఎంపిటిసి సభ్యులు కురందాసు నాగేశ్వరరావు, గాద్ది రాంబాబు, బడే అప్పాయమ్మల ఆధ్వర్యంలో వైసిపికి చెందిన పలువురు ఆదివారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కుండువాలను కప్పి సత్యప్రభ ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని, తమ ప్రభుత్వ పాలనలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని, టిడిపి, జనసేన సంయుక్తగా అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలంతా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు గంటిమల రాజ్యలక్ష్మి, గొల్లపల్లి బుజ్జి, మాజీ ఎంపిపి భాస్కర్ బాబు, టిడిపి మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పర్వత సురేష్, పైల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

రమణరాజు దీక్ష విరమణకు చొరవ చూపాలి

ప్రజాశక్తి - కాకినాడ

రమణరాజు దీక్షకు మద్దతు తెలుపుతున్న సిపిఎం నాయకులు

సామాజిక కార్యకర్త దూసర్లపూడి రమణరాజు ప్రజల పక్షాన చేపట్టిన నిరవధిక దీక్షను విరమింపచేసేందుకు చొరవ చూపాలని సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. రమణరాజు చేపట్టిన దీక్షా ఆదివారం నాటికి 3వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలోనే శిబిరాన్ని కాకినాడ డిఎస్పి సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కెఎస్.శ్రీనివాస్, తిరుమల శెట్టి నాగేశ్వరరావు, పెద్దింశెట్టి రామకృష్ణ, చింతపల్లి అజేయ్‌కుమార్‌లు డిఎస్పితో మాట్లాడారు. కలెక్టరేట్ వద్ద ప్రజాస్వామ్యయుతంగా తమ నిరసన తెలియచేసేందుకు అవకాశం ఇవ్వాలని రమణరాజు దీక్ష చేపట్టారని తెలిపారు. గతంలో అధికారులు ఇచ్చిన హామీని అమలు చేయాలని మాత్రమే ఆయన దీక్ష చేపట్టారని వివరించారు. దీనిపై అధికార యంత్రాంగం గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నదే రమణరాజు నిరవధిక దీక్షకు కారణమన్నారు. మూడు రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్నా అధికార యంత్రాంగంలో ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమని అన్నారు. కనీసం ప్రభుత్వ వైద్యుల ద్వారా ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు కూడా పంపకపోవడం ఆందోళనకరమని అన్నారు. రమణరాజు వయసు, ఆరోగ్య రీత్యా ప్రభుత్వం తక్షణ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పద్మావతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌గా కెవి. పద్మావతి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె నిడదవోలు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై పెద్దాపురం కమిషనర్‌గా వచ్చారు. ఇప్పటి వరకు మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన జె.సురేంద్ర గ్రేటర్ విశాఖపట్నం కార్పొరేషన్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు.

ఎంపిడిఒగా ఉషారాణి నియామకం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎంపిడిఒగా ఎం.ఉషారాణి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఎంపిడిఒగా విధులు నిర్వ ర్తించిన అశోక్ కుమార్ పశ్చిమగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న ఉషారాణి పెద్దాపురం ఎంపిడిఒగా నియమితులయ్యారు.

విద్యార్థులకు కథలు చదవడంలో అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు "సండే స్టోరీ టైం" నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకం చదవటంలో అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవటం వల్ల అన్ని అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బుల్లయ్య, పాఠకులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి

మంత్రి విశ్వరూప్

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం



వైసిపి ఐటి విభాగం జిల్లా కార్యదర్శి దుర్గా వరప్రసాద్ ను అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చేస్తున్న మంచి పనులను ప్రచారం చేసి మళ్లీ జగన్‌ను సిఎం చేసేందుకు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సూచించారు. వానపల్లిపాలెంకు చెందిన నల్లా రామకృష్ణ దుర్గా వర ప్రసాద్ వైసిపి ఐటి విభాగం జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం గొల్లవిల్లి లో వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దుర్గా వరప్రసాద్‌ను మంత్రి విశ్వరూప్ సత్కరించి అభినందించారు.దుర్గా వరప్రసాద్ ను అభినందించిన వారిలో జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, ఎంపిటిసి సభ్యులు వంగా గిరిజ కుమారి, కొంకి ఏడుకొండలు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు తదితరులు ఉన్నారు.

వైసిపి ఐటి విభాగం జిల్లా ఉపాధ్యక్షునిగా సుధీర్ వర్మ

వైసిపి ఐటి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్.కొత్తపల్లికి చెందిన ఆర్.సుధీర్ వర్మ నియమితులయ్యారు. సుధీర్ వర్మకు పార్టీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందాయి. సుధీర్ వర్మను ఆదివార మంత్రి పినిపే విశ్వరూప్ ఆయన తనయుడు డాక్టర్ శ్రీకాంత్, పార్టీ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా సుధీర్ వర్మ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వైసిపి బలోపేతానికి మరింత కృషిచేసి మళ్లీ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా పాటుపడతానన్నారు.

యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి

సినీ నటుడు నారాయణ మూర్తి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

యువత వ్యాపార రంగంలో ప్రవేశించి, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని కాశివాని తూము సెంటర్ బైపాస్ రోడ్ ను అనుకుని ఉన్న శర్మ టీ టైమ్ సెంటర్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. టీ టైమ్ యజమాని దడాల హరి కృష్ణశర్మ ఇచ్చిన టీని స్వీకరించారు. అనంతరం టీ టైమ్ సెంటర్ యజమాని శర్మ, భార్య దుర్గ, వారి కుమారుడు మోక్షిత్ శర్మ లతో మాట్లాడారు. హరికృష్ణ శర్మ ఎం.టెక్ కంప్యూటర్ సైన్స్ చేసి స్వశక్తితో టీ టైమ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను మెరుగు పరుచు కోవడం అభినందనీయం నటుడు నారాయణ మూర్తి అన్నారు.



టీ స్టాల్ యజమాని కుటుంబంతో నటుడు నారాయణమూర్తి

ఆర్థిక సహాయం అందజేస్తున్న లయన్ జీవి రావు

'విద్యోదయ' ట్రస్ట్‌కు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

విద్యార్థుల్లో పరోపకార గుణమును పెంపొదించి, సాటివారికి సాధ్యమైనంత సహాయం చేయాలనే తలంపుతో మోడరన్ విద్యాసంస్థల అధినేత లయిన్ జి.వి.రావు విద్యోదయ చారిటబుల్ ట్రస్ట్ కు ఆర్థిక సహాయం అందజేశారు. మోడరన్ విద్యాసంస్థల్లో వివిధ విభాగాల్లో ఏర్పాటు చేసిన యూనివర్సల్ సింగిల్ ఫ్యామిలీ బాక్స్ ల ద్వారా సేకరించిన రూ.9,733 లను పట్టణంలోని విద్యోదయ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు రాంబాబుకు ఆదివారం అందజేశారు.ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా తాము యుఎస్ఎఫ్ బాక్స్‌ల ద్వారా సేకరించిన మొత్తాన్ని విద్యోదయ చారిటబుల్ ట్రస్ట్‌కి అందజేస్తున్నామన్నారు. అనంతరం విద్యోదయ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ జివి.రావు సేవాకార్యక్రమంల్లో తన వంతు సహాయం చేయడంలో ముందు ఉంటారన్నారు. మోడరన్ విద్యాసంస్థల విద్యార్థులకు ఆయన అభినందనందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, మోడరన్ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

31న 'ద్రాక్షారామ' బంద్

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామలో జరిగే బంద్ ను ఈ నెల 31న విజయవంతం చేయాలని పివిఆర్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్లుగా మూతపడిన ద్రాక్షారామ పివిఆర్ హై స్కూల్ యాజమాన్యం పైడా సత్యప్రసాద్ అక్రమ కేసులు బనాయించిందని, స్కూల్ తిరిగే తెరవాలని ఆందోళన చేసినందుకు జిల్లా కోర్టులో అక్రమ కేసులు పెట్టడంతో ఆగ్రహించిన పూర్వ విద్యార్థులు, ద్రాక్షారామ వర్తకులు 31న స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు పివిఆర్ హైస్కూల్ సాధన సమితి కన్వీనర్ మాగాపు అమ్మిరాజు మాట్లాడుతూ హై స్కూల్ ఆస్తులను కబ్జా చేసేందుకు యాజమాన్యం దురుద్దేశంతో హై స్కూల్ మూసివేసి గ్రౌండ్కు తాళాలు వేసిందని దీనిపై కొంతకాలంగా పూర్వ విద్యార్థుల సంఘం పోరాడుతోందన్నారు. అందులో భాగంగా అక్రమ కేసులు నిరసిస్తూ బుధవారం గ్రామస్తులు పార్టీలకు అతీతంగా ఏకమై బంద్ పాటిస్తున్నామని ప్రాంతాలకి, మతాలకి కులాలకి ,పార్టీలకి అతీతంగా ప్రజలంతా ఏకమై బుధవారం బంద్‌కి సహకరించాలని అన్నారు.

పివిఆర్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం

బంద్ వివరాలు ప్రకటిస్తున్న సాధన సమితి కన్వీనర్ అమ్మి రాజు

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి వైసిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు.

పట్టణం లోని వైసిపి కార్యాలయంలో కె.గంగవరం మండల గ్రామ సచివాలయాల కన్వీనర్లతో నియోజకవర్గ ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిల్లి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ నాడు సిద్ధం-నేడు సిద్ధం కార్యక్రమం ఫిబ్రవరి 1 నుంచి మూడో తేదీకి వాయిదా పడిందని కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కష్టి చేయాలి అన్నారు. కె.గంగవరం మండలం కన్వీనర్లతో పాటు పలువురు వైసిపి నాయకులు, అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న పిల్లి సూర్యప్రకాష్

చాగల్లు ఎస్ఐగా నాగరాజు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు ఎస్ఐగా పి.నాగరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన నిడదవోలు పట్టణ ఎస్ఐగా పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా చాగల్లు వచ్చినట్ల ఆయన తెలిపారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సిహెచ్వి.రమేష్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి బదిలీ అయ్యారు.

గ్లూకోజ్ ఫ్యాక్టరీని తెరవాలని వినతి

ప్రజాశక్తి - బిక్కవోలు

కానేడు గ్లూకోజ్ ఫ్యాక్టరీని తెరిపించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఫ్యాక్టరీ కార్మికులు ఆదివారం అనపర్తి ఎంఎల్ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకుడు ఎ.నాగేశ్వరరావు మాట్లాడారు. గ్లూకోజ్ ఫ్యాక్టరీ యాజమాన్యం రెండు నెలలుగా ఫ్యాక్టరీని మూసేసి తమను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న 250 మంది కార్మికులను తొలగించే ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. దీనిపై ఎంఎల్ఎ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు వి.రాంబాబు, కె.వెంకటరమణ, కార్మికులు పాల్గొన్నారు.

'రా.. కదిలిరా'ను విజయవంతం చేయాలి

నల్లజర్ల : 'రా.. కదిలిరా' సభను విజయవంతం చేయాలని టిడిపి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు పిలుపునిచ్చారు. అనంతపల్లిలోరి ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో, జయహో బిసి మండల సమావేశం, రా కదిలిరా.. సభల సన్నాహక సమావేశం టిడిపి మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగింది. దీనికి మద్దిపాటి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం, సన్నాహక సభకు జన సమీకరణ వంటి అంశాలపై చర్చించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి సభలను జయప్రదం చేయాలన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, KOVVURU
E.A. No. 19/2023, E.P. No. 29/2017,
O.S. No. 68/2015.
Between:
చెన్నుపాటి భానుప్రసాద్ ...పిటీషనర్/ DHR.
AND
శ్రీమతి కాండ్రేగుల యామిని @ దివ్య స్వరూప ...రెస్పాండెంట్/ JDR.
To,
రెస్పాండెంట్/ JDR:
శ్రీమతి కాండ్రేగుల యామిని @ దివ్య స్వరూప, భర్త వెంకట దుర్గా ప్రవీణ్ కుమార్, వెంకటాయపాలెం, గోపాలపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా.
పై నెంబరు E.A.No.19/2023, E.P. No.29/2017, O.S.No.68/2015. సంగతులు తెలియజేయ నిమిత్తం రెస్పాండెంట్ / JDR కు కోర్టు ద్వారాను మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారాను ఎన్ని పర్యాయాలు నోటీసులు పంపినప్పటికీ సదరు రెస్పాండెంట్ / JDR బుద్ధి పూర్వకముగా Avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టువారు ఉత్తర్వుల ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా E.A సంగతులు తెలియజేయడమైనది. పై నెంబరు గ్రంధములో మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తేది:05/02/2024 వ తేదిన ఉదయం 10:30 గం।లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకోవచ్చును. లేని యెడల వారి పరోక్షమున తీర్మానించడమగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా:05/02/2024
ఆత్మూరి సత్యనారాయణ,
వాదితరపు అడ్వకేట్,
సెల్:9849847197,
కొవ్వూరు, తూ,గో,జిల్లా,. ఆంధ్రప్రదేశ్